క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: కాజులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి తదితర గ్రామాల గృహావాసాల వినియోగదారులకు, రొయ్యల చెరువులు, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లుగా రామచంద్రపురం డివిజన్ ఈఈ విజయానందం బుధవారం విలేకరులకు తెలిపారు. లొల్ల, సోమేశ్వరం, రామచంద్రపురం పట్టణ పరిధిలోని కొత్తూరు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు.

మృతుల కుటుంబీకులకు ఆర్థిక సాయం

కాజులూరు: గొల్లపాలెం ఎస్సీ పేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలివెల సత్తిబాబు కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న తదితరులు బుధవారం బాధిత కుటుంబీకులను పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల కమిటీ నాయకులు పలివెల రాజు, నున్న వెంకటేశ్వరరావు, గరగ రాంబాబు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యాదీవెన సొమ్ము పేరుతో మోసం

ముగ్గురు ఖాతాల్లోంచి రూ.15,498 స్వాహా

మండపేట: 'అమరావతి హెడ్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. మీకు విద్యాదీవెన సాయం విడుదలైంది. మీ ఫోన్‌కు పంపిన లింక్ క్లిక్ చేస్తే మీ అకౌంట్‌కు నగదు జమవుతుంది' అని వస్తున్న ఫోన్‌ను నమ్మి లింక్ ఓపెన్ చేస్తే అకౌంట్‌లోని సొమ్ములు కాజేసిన ఘటన మండపేటలో చోటుచేసుకుంది. ముగ్గురు అకౌంట్ల నుంచి ఈ విధంగా రూ.15,498 నగదును కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానిక విజయలక్ష్మినగర్‌కు చెందిన పలివెల శిరీషకు 5వ తేదీ మధ్యాహ్న సమయంలో 97111 40347 నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మీకు ఆగిపోయిన విద్యాదీవెన పడుతుందని చెప్పిన సదరు వ్యక్తి శిరీష సెల్‌కు ఫోన్‌పే లింక్ పంపాడు. అతని మాటలు నమ్మి లింక్ క్లిక్ చేసే సరికి తన అకౌంట్‌లో ఉన్న రూ.2,700 నగదు ఖాళీ చేసేశారు. శిరీషతో పాటు అమ్మ ఒడి, విద్యా దీవెన వస్తుందని చెప్పి తమ ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు మహిళల అకౌంట్‌ల నుంచి రూ.2,999, రూ. 9,799లు మోసం చేసినట్టు శిరీష ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. వివిధ కారణాలతో ప్రభుత్వ పథకాలు ఆగిన వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి వారు పంపే లింకులు ఓపెన్ చేసి మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే సచివాలయంలో సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఘనంగా రామాలయ విగ్రహ ప్రతిష్ఠ



గోగన్నమఠం రామాలయం విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోగన్నమఠం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీలక్ష్మణ హనుమ సీత సమేత శ్రీసీతారామ స్వామి వారి ఆలయ విగ్రహ శిఖర ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం 11.19 శుభ ముహూర్తంలో యాలంగి కృష్ణ-ఈశ్వరి దంపతుల చేతుల మీదుగా వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కనులపండువలా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన ఎస్.సుబ్బారాయుడు రూ.10,116, పోడూరుకు చెందిన కె.మణికంఠ రూ.10,116, హైదరాబాద్‌కు చెందిన ఎస్.వెంకటరమణ-చంద్రిక దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

అధిక నత్రజనితో చేనుకు చేటు

- తొలకరి పంటకు తెగుళ్ల బెడద
- పంటను ఆశిస్తున్న మాగుడు, ఎండు తెగులు, కాండం తొలుచు పురుగు



తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

మండపేట: అవసరానికి మించి నత్రజని(యూరియా) వినియోగం తొలకరి పంటను తెగుళ్లబారిన పడేస్తుంది. మాగుడు, ఎండుతెగులు, కాండం తొలుచు పురుగు ఆశించి పంటకు నష్టం కలుగజేస్తున్నాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 98,000 ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట దుబ్బుచేసే దశ నుంచి చిరుపొట్ట దశల్లో ఉంది. ఎరువులకు సంబంధించి నత్రజని అధికంగా ఉండే యూరియాను అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలి. నేరుగా కాకుండా పొటాష్‌తో కలిపి వేయాలి. దుబ్బు బాగా చేస్తుందన్న భావనతో కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను నేరుగా వేయడంతో పొలంలోను, గట్లపై కలుపు పెరిగిపోయి తెగుళ్ల వ్యాప్తికి కారణమవుతుంది. దీనికి తోడు ప్రతికూల వాతావరణంతో ప్రస్తుతం వరి పంటకు మాగుడు, ఎండుతెగులు వ్యాపిస్తున్నట్టు వ్యవసాయాధికారులు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మాగుడు(పొడ తెగులు)

ఆకు అడుగుభాగంలో, కాండంపైన లేత బూడిద రంగులో పొడ మచ్చలు ఏర్పడి పైరు పైవరకూ వ్యాపిస్తాయి. తొలి దశలో మచ్చలు లేత బూడిద రంగులో ఉండి క్రమేపీ పసుపు రంగులోకి మారి మొక్క ఎండిపోయినట్టుగా కనిపిస్తుంది. నివారణ కోసం పొలాన్ని సాధ్యమైనంత వరకూ ఆరబెట్టాలి. మాగుడు ఎక్కువగా కనిపించినప్పుడు ఎక్సాకొనోజాల్, లేదా వెలిడామైసిన్ మందును లీటరు నీటికి రెండు ఎంఎల్ చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

ఆకు ఎండుతెగులు

ఆకు ఎండు తెగులు సోకితే ఆకు కొనలు పసుపు రంగులోకి మారి ఆకు మధ్య వరకూ వ్యాపిస్తాయి. ఈ తెగులు ఆశిస్తే తొలి దశలో ఎకరాకు ఒక కేజీ సూడోమోనాస్ అనే జీవశిలీంద్ర నాశినిని వాడాలి. సాయంత్రం వేళలో వేరే రసాయనాలేవీ కలపకుండా లీటరు నీటికి ఎనిమిది గ్రాములు చొప్పున కలిపి చేనంతా తడిచేటట్టు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. తెగులు ఉధృతంగా ఉంటే ఎకరాకు కోపర్ హైడ్రాక్సైడ్ (కొసైడ్) 400 గ్రాములు, 100 గ్రాములు ప్లాంటమైసిన్ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అవసరం మేరకే ఎరువులు వాడాలి



అధికంగా నత్రజని (యూరియా)ని వినియోగించడం వల్ల కలుపు ద్వారా తెగుళ్ల వ్యాపించి పంటకు నష్టం కలగజేస్తాయి. అవసరమైన మేర మాత్రమే యూరియాను నేరుగా కాకుండా పొటాష్‌తో కలిపి వేయాలి. పొలంలో, గట్లపై కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– కె.ఏసుబాబు, వ్యవసాయాధికారి, మండపేట

కాండం తొలుచు పురుగు

ఈ గొంగలి పురుగు ఆకుమడి దశ నుంచి మొదలై పంట కోత వరకు ఆశిస్తుంది. కాండంలోని అడుగు భాగాన్ని తినేయడం వల్ల మొవ్వ పడిపోయి పిలక చనిపోతుంది. పైరు ఈనిన తర్వాత ఈ పురుగు ఆశిస్తే తెల్లకంకులు ఏర్పడతాయి. నత్రజని అధికంగా వాడటం వలన ఈ పురుగు అధికంగా ఆశిస్తుంది. చేలో ఎకరాకు ఎనిమిది వరకూ లింగాకర్షక బుట్టలు పెట్టుకుని పురుగు ఉధృతిని గమనించొచ్చు. నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ ఫొడర్ లీటరు నీటికి రెండు గ్రాములు, లేదా ఎసిఫేట్ లీటరు నీటికి 1.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

మహిళా సాధికారతకు పెద్దపీట

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చెల్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



చెల్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని చెల్లూరులో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకుంటూ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సుపరిపాలనకు నాంది పలికారన్నారు. ప్రతి వలంటీర్‌కు 50 ఇళ్లను కేటాయించి వారి యోగక్షేమాలను చూస్తున్నారన్నారు. తద్వారా సుపరిపాలనకు నాంది పలికారన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తోడుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ పాలిక రాఘవ, ఎంపీటీసీ పలివెల వెంకటఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ బద్దాల రాంబాబు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చోడె వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల కన్వీనర్ వెలగల సత్యనారాయణరెడ్డి, తవిటికి రత్నకుమార్, పలివెల రామకృష్ణ, గౌరీపట్నం శ్రీను, పేలూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

యువనేత పృథ్వీరాజ్



పృథ్వీరాజ్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ గోవిందరాజులు, గ్రామస్తులు

మండపేట: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని మారేడుబాకలో గ్రామ సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యురాలు చొల్లంగి సత్యవేణి, పార్టీ నాయకులతో పృథ్వీరాజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో అర్హులందరికీ వాటిని అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. గ్రామానికి విచ్చేసిన పృథ్వీరాజ్‌ను సర్పంచ్ గోవిందరాజులు తదితరులు ఘనంగా సత్కరించారు. తొలుత ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పృథ్వీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీకు మేమున్నాం.. సేవలందిస్తాం



కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడు పంపన బ్రహ్మంకు పింఛన్ అందజేస్తున్న చెల్లూరు వలంటీర్ కె.సుకన్య



విజయనగరం జిల్లా సాలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారు జుత్తుక భాగ్యవతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గుత్తుల దీపిక



కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న సోమేశ్వరం వలంటీర్ గుత్తుల సాయిదుర్గ



పెదపూడి మండలం పుట్టకొండలో లబ్ధిదారు విజయలక్ష్మికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి

దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్లు

రాయవరం: ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి ముంగిటకే పింఛన్ ఠంచన్‌గా అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే.. ఈ మాటలు లబ్ధిదారుల నోటి నుంచే వినిపిస్తున్నాయి. అనారోగ్యంతోనో, ఇతరత్రా కారణాల వల్లనో దూర ప్రాంతాల్లో ఉంటున్న లబ్ధిదారులకు సైతం వలంటీర్లు పింఛన్ సాయం అందిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నెలలోనూ దూర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారుల వద్దకు దూరాభారమని భావించకుండా వలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేశారు. ప్రతి పనిలోనూ మీకు మేమున్నామంటూ భరోసా కలిస్తూ సేవే పరమావధిగా పనిచేస్తున్న వలంటీర్లపై లబ్ధిదారులంతా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

- విష్ణాలయాల్లో ఆధ్యాత్మిక శోభ
- ముస్తాబవుతున్న ఆలయాలు
- పలు పాఠశాలల్లో సంబరాలు



మండపేటలోని ఒక పాఠశాలలో చిన్నారుల సందడి



గొల్లపాలెం కేవీఎస్ పాఠశాలలో సంప్రదాయ దుస్తులతో ఉట్టుకొట్టు ఉత్సవం నిర్వహిస్తున్న చిన్నారులు

మండపేట/రాయవరం/కపిలేశ్వరపురం: వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తల్లిదండ్రులు తమ చిన్నారులను బాలకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణల్లో ముస్తాబు చేసి మురిసిపోయారు. వారిని సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసి ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. పలు పాఠశాలల్లో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. వైష్ణవాలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేడుకల నేపథ్యంలో కృష్ణుడు, గోపిక వేషధారణకు సంబంధించిన కిరీటం, దండలు, నెమలీక, దండవంకీలు తదితర సామగ్రి కిట్ల అమ్మకాలు మార్కెట్‌లో జోరుగా జరిగాయి. ఒక్కో కిట్టు రూ.200 నుంచి రూ.350 వరకూ ధర పలికాయి. అంగర, వెదురుమూడి, నల్లూరు, కాలేరు, వడ్లమూరు గ్రామాల్లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల్లో ఉట్టి కొట్టు ఉత్సవం ఆకట్టుకుంది.

ప్రేమతత్వమే కృష్ణతత్వం


ప్రేమతత్వమే కృష్ణతత్వమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) పేర్కొన్నారు. పీఠంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ 16 వేల మంది గోపికలు శ్రీకృష్ణుని ఆరాధించడంలో చిదంబర రహస్యాన్ని అర్థం చేసుకుని ప్రేమ తత్వాన్ని బోధపర్చుకుంటే సమాజం బృందావనంగా మారుతుందన్నారు. వెదురుపాక గీతామందిరంలో గీతామందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేకువజామున 5 గంటల నుంచి భగవద్గీత 18 అధ్యాయాలను ఎనిమిదిసార్లు, విష్ణు పారాయణాన్ని ఎనిమిదిసార్లు భక్తులు ఆలాపన చేశారు. శ్రీకష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ఉట్టికొట్టారు. భగవద్గీత పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. భక్తులకు ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కాజులూరు: మండల గ్రామాల్లో శ్రీకృష్ణభగవానుని జన్మదినమైన కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని తణుకువాడ, గొల్లపాలెం, కాజులూరు, దుగ్గుదుర్రు, కోలంక తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలను దర్శించుకుని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి గీతాపారాయణ పఠించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్యక్రమంలో భాగంగా గొల్లపాలెం కేవీఎస్ పాఠశాలలో ఒక్క రోజు ముందుగానే బుధవారం కృష్ణాష్టమి సంబరాలు కనులపండువగా నిర్వహించారు. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో పాఠశాలకు హాజరయ్యారు. స్కూల్ కరస్పాండెంట్ కొల్లు బయ్యేశ్వరరావు, అకాడమిక్ డైరెక్టర్ కె.సరితల ఆధ్వర్యంలో జరిగిన ఉట్టుకొట్టు ఉత్సవంలో విద్యార్థులు పాల్గొని శ్రీకృష్ణుని భక్తిగీతాలను ఆలపించారు. ఉపాధ్యాయులు కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

కె.గంగవరం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో అలరించారు. సంప్రదాయ దుస్తులలో విద్యార్థులు పాఠశాలకు చేరుకుని వేడుకలు నిర్వహించారు. మండలంలోని అముజూరులో గొల్లపుట్టిని పగలగొట్టేందుకు పోటీపడ్డారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోటిపల్లి బస్టేండ్ సెంటర్ వద్ద కృష్ణాష్టమి సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో వేదపండితులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించిన తీర్థప్రసాదాలు అందించారు.



వెదురుపాక గీతాశ్రమంలో ప్రత్యేక అలంకరణలో కృష్ణభగవానుడు



మోడరన్‌లో జరిగిన కృష్ణాష్టమి వేడుకలు

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని బుధవారం మోడరన్ హైస్కూల్ నందు నిర్వహించిన వేడుకలు కోలాహలంగా జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక ముచ్చిమిల్లి రోడ్డులో ఉన్న ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్ లో చిన్నారులు ప్రదర్శించిన చిన్ని కృష్ణ, గోపికమ్మల అభినయాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మోడరన్ అధినేత లయన్ జీవీ రావు మాట్లాడుతూ ప్రపంచానికి భగవద్గీత ప్రవచించిన శ్రీకృష్ణ పరమాత్ముని జన్మదినం భారతీయులకు పర్వదినమని, ప్రపంచవ్యాప్తంగా కృష్ణ తత్వం వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్స్ ఎ.రమాదేవి, ఆర్.ఉమాదేవి, హెచ్ఎం ముత్యాల చిట్టిబాబు, స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.



అంగరలో గోపిక, కృష్ణ వేషధారణలో చిన్నారులు



కోటిపల్లిలో కృష్ణాష్టమి పూజలు చేస్తున్న పండితులు

వంతెనకు మరమ్మతులు చేపట్టాలి



కాజులూరు శివారు ఏజీకే పేట వద్ద ఆత్రేయ గోదావరిపై శిథిలావస్థలో ఉన్న వంతెన

కాజులూరు: ఆత్రేయ గోదావరిపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలోని ఏజీకే పేట నుంచి లింక్ రోడ్ మీదుగా టేకి డ్రెయిన్‌పై పంటు దాటి పల్లిపాలెం, కోలంక తదితర గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా సుమారు 20 ఏళ్ల క్రితం అధికారులు ఈ డ్రెయిన్‌పై కాలిబాట వంతెనను నిర్మించారు. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణ లోపం కారణంగా కొద్ది రోజులకే ఇది శిథిల దశకు చేరుకుంది. ప్రస్తుతం వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయి వంతెన కింది భాగంలో పెచ్చులూడిపడుతున్నాయి. సైకిల్, బైక్ వంటి వాహనాలు ప్రయాణించాలంటే ఏ మాత్రం వీలు లేకుండా ఉంది. పాదచారులు సైతం తప్పనసరి పరిస్థితుల్లో భయం భయంగా వంతెనపై నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెనకు మరామ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కోరుమిల్లిలో చెరువు ఆక్రమణల తొలగింపు



కోరుమిల్లి బసవరాజు చెరువుగట్టుపై క్రేన్ సాయంతో సాగుతున్న ఆక్రమణల తొలగింపు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి ప్రధాన సెంటర్ సమీపంలోని బసవరాజు చెరువు గట్టుపై ఉన్న ఆక్రమణలను బుధవారం పంచాయతీ అధికారుల సమక్షంలో తొలగించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో నివాసాలను తొలగించారు. బసవరాజు చెరువు గట్టుపై తాత్కాలిక నివాసదారులకు ప్రత్యామ్నాయం చూపి ఆక్రమణలను తొలగించాలంటూ 2018లో కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు ఆదేశాలపై రెవెన్యూ అధికారులు గట్టుపై నివాసముంటున్నవారిలో అర్హులైనవారికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను కేటాయించారు. మూడు నెలల్లో ఆక్రమణలను తొలగించాలంటూ 2022 సెప్టెంబర్ 7న కోర్టు మళ్లీ ఆదేశించింది. ఆ ఆదేశాలపై పంచాయతీ అధికారులు ఆక్రమణలను తొలగిస్తుండగా ఆక్రమణదారులు అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పందించి నివాసాలను తొలగించుకునేందుకు వీలుగా ఆరు నెలలు గడువు ఇవ్వమని అధికారులకు చెప్పారు. ఈలోగా కొందరు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకున్నారు. గడువు పూర్తికావడంతో పంచాయతీ అధికారులు బుధవారం మిగిలి ఉన్న ఆక్రమణలను తొలగించారు. తన నివాసాన్ని తొలగించవద్దంటూ ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా స్థానికులు వారించారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ఆలమూరులో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు, ఎం.శ్రీనివాసు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు.

సబ్‌కలెక్టర్ ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామిని రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ ఎ.చైత్రవర్షిణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.